క్లుప్తంగా

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

సీతంపేట: ఐటీడీఏ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఈ నెల 12న జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. అథ్లెటిక్స్ లాంగ్ జంప్ అండర్ 14లో బిడ్డిక ప్రదీప్, కోకో అండర్ 14 విభాగంలో వట్టి జోషెఫ్, కబడ్డీలో బి.అభిషేక్, ఆమేర్, బి.వరుణ్‌సందేశ్, వాలీబాల్‌లో టి.ఈశ్వర్ గెలుపొందారు. త్వరలో జరగబోయే నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్

గరుగుబిల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అక్టోబర్ 3 నుంచి నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.పైడితల్లి తెలిపారు. తన కార్యాలయంలో ఆమె విలేకరులతో బుధవారం మాట్లాడారు. ఎంపీడీఓ, తహసీల్దార్ రెండు టీంలుగా ఏర్పడి ఈ శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రకటించడం జరిగిందన్నారు. అక్టోబర్ 3న గొట్టివలస, 4న చినగుడబ, 5న కొత్తూరు, 6న నాగూరు, 10న పెదగుడబ, 11న తోటపల్లి, 12న రావుపల్లి, 18న సంతోషపురం, 19న ఉద్దవోలు, 20న పెద్దూరు, 25న ఉల్లిభద్ర, 26న రావివలస, 27న గరుగుబిల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాలకు ఆయా గ్రామాల్లోని పాఠశాలల గదులను ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



హైస్కూల్‌కు కుర్చీలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకున్న 1982 – 83 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు రూ.10 వేలు విలువ గల కుర్చీలు, ఇతర సామగ్రిని బుధవారం వితరణ చేసారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో తోడ్పాటు అందిస్తోందని, అలాగే పూర్వ విద్యార్థులు కూడా పాఠశాలల అభివృద్ధికి చేయూతనివ్వాలని వారు కోరారు.

పోలీసుల ప్రజా సేవ



గొయ్యి వద్ద జేసీబీతో సరి చేయిస్తున్న బత్తిలి పోలీసులు

భామిని: బిల్లుమడ – గురండి గ్రామాల మధ్య రహదారిలో పెద్ద గొయ్యి ఏర్పడి వర్షం నీరు చేరి బురద గుంటగా మారి బుధవారం ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడడంతో బత్తిలి పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. రాత్రి వరకు జేసీబీ పెట్టి బురదను తొలగిస్తూ భారీ వాహనాలు దిగిపోకుండా రోడ్డు పక్కగా తరలింపు చేపట్టారు. బత్తిలి ఎస్‌ఐ యతిరాజుల అమ్మనరావు, ఏఎస్‌ఐ గురుమూర్తి ఆధ్వర్యంలో అంతరాయాలను తొలగిస్తూ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ఒడిశా నుండి వచ్చే భారీ ఇసుక తరలింపు లారీలను నిలిపి వేయించారు.

వేగవంతంగా బీమా నమోదు

భామిని: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ గృహసారథులకు కల్పించిన బీమా సౌకర్యాన్ని నమోదు చేయడంలో సచివాలయ కన్వీనర్లు చొరవ చూపాలని జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ బుదవారం పిలుపునిచ్చారు. మండలంలోని భామిని, బాలేరు, సొలికిరి, నల్లరాయిగూడ, బురుజోల పంచాయతీ పరిధిలో గృహ సారథుల బీమా నమోదులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్ల సారథ్యంలోనే గృహసారథులు పేర్లు, వివరాలు నమోదు కావలసి ఉందని తెలిపారు. బీమాతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. బీమా నమోదులో ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. వివరాలు పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సూచించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : పీఓ

సీతంపేట: ఇంజినీరింగ్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి తెలిపారు. పీఆర్, ట్రైబల్‌వెల్ఫేర్ ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం పనులను పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేల నిర్మాణాలు సకాలంలో చేపట్టాలని ఆమె సూచించారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే కళావతి
- 6వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం ప్రధాన లక్ష్యంగా రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన చేస్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పట్టణంలోని 6వ వార్డు పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యేకు హారతులతో ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలపై లబ్ధిదారులు సంతృప్తిని వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంత మంచి చేస్తున్న ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పలాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ పాలనను దేశం మొత్తం ఆసక్తిగా చూస్తున్నారన్నారు. ఎటువంటి వివక్షత లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, కౌన్సిలర్లు తూముల లక్ష్మణరావు, నీలాపు శ్రీనివాసరావు, రెడ్డి లక్ష్మీ కేశవరావు, ఎస్‌ఐ శివప్రసాద్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. రామలీలా డిగ్రీ కళాశాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. కళాశాలలో ప్రత్యేక డెమో చేపట్టారు. ఈ క్రమంలో ప్రమాదాలను అదుపుచేసేందుకు తమ శాఖ వినియోగించే పరికరాలపై అవగాహన కల్పించారు.

16న కొత్త పింఛన్ల పంపిణీ

గరుగుబిల్లి: కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 16న ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు హాజరు కావాలని కోరారు.

రాకపోకలకు అవస్థలు



రోడ్డు మీద నిలిచిపోయిన లారీ

గరుగుబిల్లి: పార్వతీపురం – శ్రీకాకుళం రహదారి పరిధిలోని తోటపల్లి ప్రాజెక్టు కుడిప్రధాన కాలువ సమీపంలో భారీ వాహనం రెండు రోజుల కిందట మరమ్మతులకు గురై నిలిచిపోయింది. ఈ రహదారి పరిధిలో పలు చోట్ల గోతులు ఉండడంతో రాకపోకలు చేసేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పరిధిలో నిల్చిన లారీని తీసేలా చర్యలు చేపట్టకపోడంతో పక్కన ఉన్న గోతుల నుంచి వాహనాలు రాకపోకలు చేయాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిలిచిన వాహనాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం



పెద్దదిమిలిలో పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ తొగరాన శ్రీను

భామిని: పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి జగనన్న నిలుస్తారని, అర్హులందరికీ వైఎస్సార్ పింఛన్ కానుకలు అందించి మరోసారి నిరూపించుకున్నారని వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రెండవ విడత మంజూరైన 213 కొత్త పింఛన్లను బుధవారం వారు పంపిణీ చేశారు. పెద్దదిమిలిలో సర్పంచ్ తొగరాన శ్రీను, పసుకుడిలో సర్పంచ్ భార్గవనాయుడు, బురుజోలలో సర్పంచ్ మడపాన కేశవరావు ఆధ్వర్యంలో కొత్త పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు.

రోజంతా వర్షం



పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి సమీపంలో నీట మునిగిన తంపర భూములు



గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం



భామిని: వంశధార నదిలో వరదనీరు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో బుధవారమంతా ఎడతెరిపివ్వకుండా తేలికపాటి వర్షం కురిసింది. వాయుగుండం ప్రభావం వలన కురిసిన వర్షానికి మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో జరిగిన వారపు సంతకు పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన క్రయ, విక్రయదారులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

పాలకొండలో...

పాలకొండ రూరల్: బంగాళాఖాంతలో ఏర్పడ్డ ఉపరితల ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు నాగావళి నదితో పాటు చెరువులు, సాగునీటి వనరుల్లో జల కళ సంతరించుకుంది. బుధవారం సాయంత్రం నుంచి ఏకధాటిగా వర్షం కురవటంతో పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా జనజీవనం స్థంభించింది. పాలకొండ – పార్వతీపురం రోడ్డుపై నీరు ప్రవహించటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

వంశధారలో..

భామిని: బంగాళాఖాంతలో ఏర్పడ్డ ఉపరితల ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. వంశదార నదీ ఎగువ ప్రాంతమైన ఒడిశాలోనూ వర్షాలు కురుస్తుండడంతో నదిలో వరద నీరు బుధవారం పెరుగుతూ వచ్చింది. కాట్రగడ–బి వద్ద వంశదార ఓపెన్ హెడ్ చానల్‌లోకి నదిలోని నీరు ప్రవేశించింది.

దసరా ఉత్సవాలు విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే కళావతి



దసరా ఉత్సవ ఏర్పాట్లుపై సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలు విజయవంతంగా చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఆలయ ఆవరణలో దసరా ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 15నుంచి 24 వరకు నిర్వహించే ఉత్సవాలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సహకరించాలని కోరారు. పాలకొండ కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలకు ఉత్తరాంధ్రలోనే ప్రత్యేకత ఉందని ఆ మేరకు ఏర్పాటు చేయాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ అమ్మవారి సేవ చేసేందుకు కలిగిన అవకాశంగా భావించి పూర్తి స్థాయి సహకారం అందిస్తామని తెలిపారు. డీఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రజలు సహకరించాలని కోరారు. నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, సీఐ మురళీధర్, వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు వెలమల మన్మధరావు, ఎంపీపీ బొమ్మాళి భాను, ఆలయ ఈఓ మరళీకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పంట పొలాలను పర్యవేక్షించాలి



సంతోషపురంలో పొలం బడి

గరుగుబిల్లి: ఖరీఫ్‌లో వరి పంటకు ఆశించే తెగుళ్లను క్రమం తప్పకుండా రైతులు పరిశీలించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రభందకులు పి. షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని సంతోషపురం గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలకు ఆశించే తెగుళ్ల, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఆశించే కాండం తొలుచు పురుగులు, అగ్గి తెగులు, ఆకుముడత తెగుళ్ల వచ్చినపుడు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఆర్.విజయభారతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదులో అలసత్వం వద్దు

- మండల సమావేశంలో ఎమ్మెల్యే కళావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రైతులు పండించే ప్రతీ పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సూచించారు. ఈ – క్రాప్ నమోదులో గతేడాది జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా వ్యవసాయశాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటరమణనాయుడు అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గతేడాది కొందరు అధికారులు ఫీల్డ్‌కు వెళ్లకుండా ఆఫీసుల్లో కూర్చుని ఎవరో ఏదో చెబితే పంటల నమోదు చేయడం వల్ల చాలా వివాదాలు నెలకొన్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీని దృష్ట్యా రైతుతో కలసి అతని పొలం వద్దకు వెళ్లి ఆ పంటల వివరాలను, రైతుల పేర్లు, ఇతర వివరాలను తప్పులు దొర్లకుండా నమోదు చేయాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజను సాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక శ్రద్ద వహించాలని జల వనరుల శాఖ అధికారులకు సూచించారు. రైతులకు కావాల్సిన ఎరువులను అన్ని ఆర్‌బీకే సెంటర్లలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులు రైతులకు ఉపయోగకరంగా ఉండేలా చేపట్టాలని సూచించారు. అర్హులైన అందరికీ ప్రభుత్వం ద్వారా పింఛన్లు అందజేస్తున్నామని, ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వెంటనే వలంటీర్లు ద్వారా దరఖాస్తు చేయించాలని సూచించారు. రూ.5.50 కోట్లతో చేపడుతున్న వీరఘట్టం ప్రధాన రహదారి పనులపై ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే కళావతి ఆరా తీసారు. గత ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేసి వీరఘట్టం ప్రధాన రహదారి అభివృద్ధి చెందకుండా అడ్డుకుందని, మేము ఎప్పుడూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేయలేదని అందుచే రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి తొందరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇటీవల రూ.80 లక్షల గడప గడపకు నిధులతో వీరఘట్టం మేజరు పంచాయతీలో చేపట్టిన పనుల పరిస్థితిపై ఆరా తీసారు. పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామాల్లో గుర్తించిన కొన్ని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆ సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే కళావతి అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు విశ్వాసరాయి భార్గవ్, పర్రి విజయకుమారి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యతతో విజయం సాధిస్తాం..



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొమరాడ: రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా పని చేసి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులతో సమన్వయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలు తమలో అంతర్గత విబేధాలు ఉన్నాయని లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని ఇది వాస్తవం కాదన్నారు. తామంతా ఒకే తాటిపై ఉన్నామని ఎటువంటి విబేధాలు లేవని స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయమే శిరోధార్యంగా భావించి ముందుకు వెళ్తామన్నారు. పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా కలసి పని చేసి పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి శెట్టి మధుసూదనరావువు, ట్రెజరర్ కళింగి మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, కొమరాడ, శివిని పీఏసీఎస్ చైర్మన్లు మరడాన సూరపునాయుడు, పప్పల గోపాలకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ ఏగిరెడ్డి సింహాచలం, దాసరి శ్రీధర్ పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గున్నారు.

వైద్యుల సూచనలు పాటించండి



వైద్య సిబ్బందికి యూవిన్ యాప్‌లో అప్‌లోడ్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పాలకొండ రూరల్: పిల్లల ఆరోగ్య భద్రత విషయంలో తల్లితండ్రులు వైద్యుల సూచనలు పాటించాలని వైద్యాధికారి తేజ్‌రత్న అన్నారు. బుధవారం మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా అన్నవరం పీహెచ్‌సీ పరిధిలో గల కొండాపురంలో పిల్లలకు టీకాలు వేశారు. టీకా పొందిన పిల్లల వివరాలు యూవిన్ యాప్‌లో అప్‌లోడ్ చేయించారు. వైద్యుల సూచనల మేరకు పిల్లలకు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించాలన్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డీఈఎంఓ వై.యోగేశ్వరరెడ్డి, గ్రామీణ వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల అందజేత



పాలకొండ: కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు అందజేస్తున్న కౌన్సిలర్లు



సీతంపేట: సోమగండిలో కొత్త పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ రుతోని



వీరఘట్టం: నడుకూరులో పింఛన్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లీలాప్రసాదరావు, సర్పంచ్ రమాదేవి

సీతంపేట: మండలంలోని సోమగండి పంచాయతీ పరిధిలో 21 మందికి కొత్త పింఛన్లు మంజూరు కావడంతో సర్పంచ్ రుతోని ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పాలకొండ : ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన సామాజికి పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని 16 వార్డు, కోటదుర్గమ్మ ఆలయ సచివాలయం, మండలంలోని కొండాపురం గ్రామంలోను నూతన పింఛన్లు అందించారు. గారమ్మకాలనీలో కౌన్సిలర్లు కడగల రమణ, తుమ్మగుంట శంకరరావుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్లు అందించారు.

392 మందికి కొత్త పింఛన్ల పంపిణీ

వీరఘట్టం : మండల వ్యాప్తంగా ఈ నెల రెండవ విడతలో మంజూరైన 392 కొత్త పింఛన్లను బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, వలంటీర్లు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. చిదిమిలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. నడుకూరులో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, సర్పంచ్ రమాదేవి లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేశారు. వీరఘట్టం మేజరు పంచాయతీలో పలు వీధుల్లో ఎంపీటీసీల ఆధ్వర్యంలో కొత్త పింఛన్లు పంపిణీ చేశారు.

పక్కాగా 'జగనన్న ఆరోగ్యసురక్ష'



మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ కొండపల్లి సత్యం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఈ నెల 29 నుంచి కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. దీనికి సంబంధించి ముందస్తు సర్వే నిర్వహించాలన్నారు. వివిధ క్లస్టర్‌ల పరిధిలో ఏవైనా సమస్యలుంటే ముందుగా గుర్తించాలన్నారు. దీనికి సంబంధించి గ్రామ వలంటీర్‌లు సర్వే పూర్తి చేయాలన్నారు. వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, తహసీల్దార్ నరసింహమూర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించాలి



మాట్లాడుతున్న వైద్యులు భార్గవ్ రెడ్డి

పాలకొండ రూరల్: క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడి నిండు జీవితం వ్యర్థం చేసుకోవటం సరైన పద్ధతి కాదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నిరోధక దినోత్సవాన్ని బుధవారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒత్తిడిని అధిగమించుటకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులు, మానసిక నిపుణులు అవగాహన కల్పించారు. విలువైన జీవితాన్ని సాఫల్యం చేసుకునే క్రమంలో ఉన్నత లక్ష్యాలు, వాటిని దక్కించుకునే మార్గాలపై వక్తలు వివరించారు. కార్యక్రమంలో ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్, రెడ్ రిబ్బన్, కళాశాల ఐక్యూ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రతినిధులు డాక్టర్ భార్గవ్‌రెడ్డి, బి.రాజు, బి.జయమణి, ఎం.శాంతి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.